# హజ్, ఉమ్రహ్ & జియారహ్ - 5

## ఖుర్ఆన్ మరియు సున్నతుల వెలుగులో

[ **తెలుగు** – Telugu – تلغو ]

**షేఖ్ అబ్దుల్ అజీజ్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్ (ర).**

**అనువాదం : ముహమ్మద్ కరీముల్లాహ్**

**పునర్విమర్శ : షేక్ నజీర్ అహ్మద్**

2012 - 1433

IslamHouse.com

# ﴿الحج والعمرة والزيارة - ٥﴾

« باللغة التلغو »

الشيخ عبد العزيز عبد الله بن باز

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2012 - 1433

IslamHouse.com

## ఐదవ అధ్యాయం:

### ఖుర్బానీ దినమున రమీ, నహర్, హలఖ్ మరియు తవాఫ్ ఆచరణలు ఒకదాని తర్వాత మరొకటి చేయాలి:

పై ఆచరణలన్నింటినీ ఖుర్బానీ దినమున హజ్ యాత్రికుడు అదే క్రమంలో ఒకదాని తర్వాత మరొకటి చేయటం ఉత్తమం. ఇంకో మాటలో చెప్పాలంటే, హజ్ యాత్రికుడు మొట్టమొదట రమీ (జమరాతులపై కంకర రాళ్ళు విసురుట) చేయాలి. తర్వాత ఖుర్బానీ, తర్వాత క్షవరం అంటే తల వెంట్రుకలు పూర్తిగా గొరిగించటం లేదా చిన్నవిగా కత్తిరింప జేయటం, ఆ తర్వాత కఅబహ్ గృహం యొక్క తవాఫ్ (తవాఫె ఇఫాదహ్) చేయాలి మరియు హజ్జె తమత్తు చేసేవారు తవాఫె ఇఫాదహ్ తర్వాత సఫా మరియు మర్వహ్ ల మధ్య సయీ కూడా చేయాలి. ఒకవేళ ముఫ్రిద్ లేదా ఖారిన్ హజ్ యాత్రికులు తవాఫె ఖుదూమ్ తర్వాత సఫా మరియు మర్వహ్ ల మధ్య సయీ చేయకపోతే, వారు తవాఫె ఇఫాదహ్ తర్వాత దానిని తప్పక పూర్తి చేయవలసి ఉంది. ఒకవేళ పైన పేర్కొనబడిన వరుస క్రమంలో వాటిని చేయలేకపోతే, దానిలో ఎలాంటి దోషమూ లేదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అలా చేయటాన్ని అనుమతించి ఉన్నారు.

ఒకవేళ తవాఫ్ లేదా ఇతర హజ్ ఆచరణలకు (హలఖ్, రమీ ...) ముందు సయీ చేసినా, దానిలో ఎలాంటి దోషమూ లేదు. ఎందుకంటే అబూ దావూద్ హదీథు గ్రంథంలో నమోదు చేయబడిన ఒక హదీథులో ఒక సహచరుడు ఈ వరుస క్రమం గురించి ప్రశ్నించగా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా జవాబిచ్చినారు: "తమకు ఇష్టమైన క్రమంలో వారు చేయవచ్చు." సమాజానికి తేలికగా ఉండేందుకు ఈ వరుస క్రమం తెలుపబడింది. ఈ హదీథు ప్రామాణికమైనదని ఉసామహ్ బిన్ షురైక్ ధృవీకరించారు.

రమీ, హలఖ్ మరియు తవాఫ్ తర్వాత హజ్ యాత్రికుడు ఇహ్రాం నిబంధనలన్నింటి నుండి పూర్తిగా విడుదలై పోతాడు. ఒకవేళ పై వాటిలో ఏ రెండు పూర్తి చేసినా, అతను పాక్షికంగా మాత్రమే ఇహ్రాం నిబంధనల నుండి విడుదల అవుతాడు.

క్రింది మూడు ఆచరణలు హజ్ నియమ నిబంధనల నుండి పూర్తిగా విడుదల చేస్తాయి:

జమరతు అఖబహ్ పై రాళ్ళు విసరటం (రమీ చేయుట), క్షవరం (తల వెంట్రుకలు పూర్తిగా గొరిగించుకొనుట లేదా చిన్నవిగా చేసుకొనుట) చేసుకొనుట మరియు తవాఫె ఇఫాదహ్ చేయుట. తప్పని సరిగా

చేయవలసి ఉన్నవారు సఫా మరియు మర్వహ్ ల మధ్య సయీ కూడా పూర్తి చేయాలి. ఎప్పుడైతే ఈ మూడు ఆచరణలు పూర్తిచేస్తారో, హజ్ యాత్రికునిపై ఉన్న ఇహ్రాం నిబంధనలన్నీ ఉదాహరణకు భార్యాభర్తల శారీరక కలయిక, అత్తరు పూసుకోవటం ... మొదలైన నిబంధనలన్నీ తొలిగి పోతాయి. ఈ మూడింటిలో ఏవైనా రెండు పూర్తి చేసిన వారిపై నుండి భార్యాభర్తల సంభోగ నిషేధం తప్ప, మిగిలిన ఇహ్రాం నిబంధనలన్నీ తొలిగిపోతాయి. ఇది పాక్షిక స్వేచ్ఛ అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

హజ్ యాత్రికుడు జమ్ జమ్ పవిత్ర జలం సేవించడం మరియు దానిని కడుపు నిండా త్రాగడం అభిలషణీయం. జమ్ జమ్ నీరు త్రాగేటపుడు, వీలయినన్ని ఎక్కువ దుఆలు చేసుకోవటం మంచిది. సహీహ్ ముస్లింలో నమోదు చేయబడిన అబూ ధర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఈ హదీథులో జమ్ జమ్ నీరు త్రాగేటపుడు చేసే దుఆల స్వీకరణకు ఎక్కువ అవకాశం ఉన్నదనే విషయం స్పష్టం చేయబడింది:

إِنَّـهُ طَـعَـامُ طُعْمٍ

ఇన్నహు తఆము తుఅమిన్

ఇది ఆరోగ్యవంతమైన పానీయం

అబూ దావూద్ లో నమోదు చేయబడిన మరో హదీథులో ఇలా పేర్కొనబడింది:

وَشِفَآءُ سُقْمٍ

వ షిఫాఉ సుఖ్మిన్

జమ్ జమ్ నీటిలో వ్యాధి నిరోధక శక్తి ఉంది.

## మీనాకు మరలి రావటం మరియు మూడు దినాలు అక్కడ నివాసం ఉండుట:

తవాఫ్ అల్ ఇఫాదహ్ మరియు తప్పని సరిగా సయీ చేయవలసి ఉన్నవారు తమ సయీని పూర్తి చేసిన తర్వాత, మీనాకు మరలి వచ్చి, అక్కడ మూడు పగళ్ళు మరియు మూడు రాత్రులు గడపాలి. ప్రతి రోజు మిట్ట మధ్యాహ్నం తర్వాత, వారు జమరాతులపై కంకర రాళ్ళు విసరాలి. రద్దీ నుండి కాపాడుకోవటానికి, ముసలివారు, బలహీనులు, స్త్రీలు రాత్రి వేళల్లో జమరాతులపై కంకర రాళ్ళు విసర వచ్చు.

## జమరాతులపై కంకర రాళ్ళు విసిరటం (రమీ చేయుట) గురించిన నియమాలు:

రమీ చేసేటపుడు క్రింది వరుస క్రమాన్ని అనుసరించాలి.

ఖైఫ్ మస్జిదుకు దగ్గరలో ఉన్న మొదటి జమరహ్ పై కంకర రాళ్ళు విసరటం ద్వారా రమీ ప్రారంభించాలి. ఏడు కంకర రాళ్ళను, ఒకదాని తర్వాత ఒకటి విసరాలి. అంతే గాని ఏడింటినీ ఒకేసారి విసరి వేయకూడదు. సున్నతు ప్రకారం, జమరాతును తమ ఎడమ వైపు ఉండేట్లు ఖిబ్లహ్ కు అభిముఖంగా నిలబడి, రెండు చేతులు పైకెత్తి, అల్లాహు అక్బర్ అని పలికి, దుఆ చేసుకోవాలి. అదే విధంగా రెండో జమరహ్ పై కంకర రాళ్ళు విసరాలి. సున్నతు ప్రకారం రెండో జమరహ్ పై ఒక్కొక్కటిగా కంకర రాళ్ళు విసిరిన తర్వాత, కొంచెం ముందుకు పోయి, ఖిబ్లహ్ కు అభిముఖంగా నిలబడి, రెండు చేతులు పైకెత్తి అల్లాహు అక్బర్ అని పలికి, వీలయినన్ని ఎక్కువ దుఆలు చేసుకోవాలి. ఆ తర్వాత మూడో జమరహ్ పై కంకర రాళ్ళు విసరాలి. అయితే, ఇక్కడ ఆగకూడదు మరియు దుఆలు చేయకూడదు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతును అనుసరిస్తూ, మొదటి రోజున అంటే దిల్ హజ్ 11వ తేదీన విసిరినట్లుగానే, దాని తర్వాత

రోజున (12వ తేదీన) కూడా మూడు జమరాతులపై కంకర రాళ్ళు విసరాలి. తష్రీక్ దినాలలోని మొదటి రెండు దినాలలో (దిల్ హజ్ 11 మరియు 12వ తేదీలు) రమీ చేయటమనేది తప్పని సరిగా చేయవలసిన హజ్ ఆచరణల భాగంగా పేర్కొనబడింది. అలాగే మీనాలో మొదటి రాత్రి (దిల్ హజ్ 10వ తేదీ రాత్రి) మరియు రెండవ రాత్రి (దిల్ హజ్ 11వ తేదీ రాత్రి) గడపటం కూడా హజ్ ఆచరణలలో తప్పనిసరిగా చేయవలసిన ఆచరణయే. అయితే నీటి వసతి కలిగించే పనులలో ఉన్న హజ్ యాత్రికులకు మరియు హజ్ చేస్తున్న పశువుల కాపర్లకు దీని నుండి మినహాయింపు ఉంది.

**మీనాలో కేవలం రెండు రోజులు మాత్రమే గడపడానికి అనుమతి ఉంది, అయితే మూడో రోజు వరకు దానిని పొడిగించడం ఉత్తమం:**

మొదటి రెండు రోజులు మూడు జమరాతులపై రమీ చేసిన తర్వాత అంటే దిల్ హజ్ 11 మరియు 12వ తేదీల తర్వాత, ఎవరైనా మీనా వదిలి వెళ్ళదలిస్తే, అలా చేయడం అనుమతించబడింది. అయితే వారు దిల్ హజ్ 12వ తేదీన సూర్యాస్తమయానికి ముందే మీనా వదిలి వేయాలి. ఒకవేళ ఎవరైనా రెండో రోజు అంటే దిల్ హజ్ 12వ తేదీ సూర్యాస్తమయం తర్వాత కూడా మీనాలోనే ఉండి పోతే, ఆ రాత్రి వారు

మీనాలోనే గడపాలి. మరుసటి దినం అంటే దిల్ హజ్ 13వ తేదీన మరలా మూడు జమరాతులపై కంకర రాళ్ళు విసరగలిగితే వారికి ఎక్కువ పుణ్యాలు లభిస్తాయి. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఇలా స్పష్టం చేసింది:

وَٱذْكُرُوا۟ ٱللَّهَ فِىٓ أَيَّامٍ مَّعْدُودَٰتٍ ۚ فَمَن تَعَجَّلَ فِى يَوْمَيْنِ فَلَآ إِثْمَ عَلَيْهِ وَمَن تَأَخَّرَ فَلَآ إِثْمَ عَلَيْهِ ۚ لِمَنِ ٱتَّقَىٰ ۗ وَٱتَّقُوا۟ ٱللَّهَ وَٱعْلَمُوٓا۟ أَنَّكُمْ إِلَيْهِ تُحْشَرُونَ ﴿٢٠٣﴾

వద్కురూల్లాహ ఫీ అయ్యామిమ్మఅదూదాతిన్ ఫమన్ తఅజ్జల ఫీ యౌమైని ఫలా ఇథ్మ అలైహి వ మన్ తఅఖ్ఖర ఫలా ఇథ్మ అలైహి లిమనిత్తఖా వత్తఖుల్లాహ వ అలమూ అన్నకుమ్ ఇలైహి తుహ్ షరూన

మరియు నిర్ణీత దినాలలో అల్లాహ్ ను స్మరించండి. కానీ ఎవరైతే రెండు రోజులలో (మీనాను) వదిలి వేయాలని త్వర పడతారో, అతని పై ఎలాంటి దోషమూ లేదు. మరియు ఎవరైతే అక్కడే ఆగిపోయారో, అతనిపై ఎలాంటి దోషమూ లేదు – ఒకవేళ అతనిది మంచి చేయలనే ఉద్దేశమే అయితే. 2:203

మీనాలో ఆగే దినాల్ని పొడిగించటం మంచిది. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలను మీనా వదలటంలో త్వరబడమని చెప్పినా, స్వయంగా ఆయన మీనా వదలటంలో త్వరబడలేదు. ఆయన మీనాలో ఆగి, దిల్ హజ్ 13వ తేదీ మిట్టమధ్యాహ్నం తర్వాత జమరాతులపై కంకర రాళ్ళు విసిరి, దొహర్ నమాజు చేయక ముందే మీనా వదిలినారు. అంటే ఆయన మూడు దినాలు మీనాలో గడిపారు.

**చిన్నపిల్లల, వ్యాధిగ్రస్తుల, వయసు మళ్ళిన వారి మరియు గర్భిణీ స్త్రీల తరుఫున మీరే స్వయంగా కంకర రాళ్ళు విసరటానికి అనుమతి ఉంది:**

చిన్న పిల్లల సంరక్షుడు, వారి తరుఫున కంకర రాళ్ళు విసరటమనేది ధర్మబద్ధమైనదే. ఎందుకంటే చిన్న వయస్సులో వారు ఆ పని చేయలేరు గనుక. ముందుగా అతను తప్పని సరిగా తను విసర వలసి ఉన్న కంకర రాళ్ళను విసిరి, ఆ తర్వాత వారి తరుఫున కంకర రాళ్ళు విసరాలి. చిన్న వయస్సులోని బాలికల విషయంలో కూడా ఇదే వెసులుబాటు ఇవ్వబడింది.

జాబిర్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు:

మేము ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు హజ్ యాత్ర చేసాము. మాతో పాటు స్త్రీలు మరియు పిల్లలు కూడా ఉండినారు. మేము లబ్బైక్ అని పలుకుతూ, మా పిల్లల తరుఫున కంకర రాళ్ళు విసిరాము. (ఇబ్నె మాజహ్)

అనారోగ్యం వలన లేదా ముసలితనం వలన లేదా గర్భం వలన ఎవరైనా స్వయంగా కంకర రాళ్ళు విసరలేకపోతే, తమ తరుఫున ఎవరినైనా నియమించవచ్చు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది:

فَٱتَّقُوا۟ ٱللَّهَ مَا ٱسْتَطَعْتُمْ

ఫత్తఖుల్లాహ్ మాస్ తతఅతుమ్

కాబట్టి వీలయినంత ఎక్కువగా అల్లాహ్ పై భయభక్తులతో ఉండండి.

64:16

ఎందుకంటే రద్దీలో వారు ముందుకు కదలలేకపోవటం మరియు జమరాతులపై కంకర రాళ్ళు విసిరే సమయం దాటిపోయే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉండటం మరియు అలా దాటిపోతే షరిఅహ్ ఏ విధమైన ప్రాయశ్చితం లేకపోవటం వలన, జమరాతులపై కంకర రాళ్ళు విసిరేందుకు వారు తమ తరుఫున ఎవరినైనా నియమించుకోవచ్చు.

ఇతర హజ్ ఆచరణలకు మరియు దీనికి మధ్య వ్యత్యాసం ఇదే, నఫిల్ హజ్ అయినా సరే – రమీ తప్ప ఇతర ఆచరణలన్నీ హజ్ యాత్రికుడు స్వయంగా చేయవలసి ఉంటుంది. ఎవరైతే హజ్ కొరకు లేదా ఉమ్రహ్ కొరకు ఇహ్రాం ధరించారో, వారు స్వయంగా హజ్ లేదా ఉమ్రహ్ ఆచరణలన్నీ స్వయంగా పూర్తి చేయాలి – అది నఫిల్ హజ్/ఉమ్రహ్ అయినా లేదా తప్పనిసరి హజ్/ఉమ్రహ్ అయినా సరే.

ఎందుకంటే ఖుర్ఆన్ లోని అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది:

وَأَتِمُّوا۟ ٱلْحَجَّ وَٱلْعُمْرَةَ لِلَّهِ

వ అతిమ్మూల్ హజ్జ వల్ ఉమ్రత లిల్లాహి

హజ్ మరియు ఉమ్రాలను అల్లాహ్ కొరకు పూర్తిచేయండి. 2:196

తవాఫ్ మరియు సయీ కొరకు ప్రత్యేకంగా నిర్ణీత సమయం ఏదీ లేదు. అయితే రమీ కొరకు నిర్ణీత సమయం విధించబడి ఉంది. అందు వలన దానిని సమయం మించిపోక ముందే పూర్తిచేయాలి. అలాగే అరఫాహ్ మైదానంలో నిలబడటం మరియు ముజ్దలిఫహ్ లో రాత్రి గడపడం కూడా నిర్ణీత సమయంలో చేయవలసిన ఆచరణలే. వికలాంగులైన హజ్ యాత్రికులు కూడా ఏదో విధంగా మిగిలిన ఆచరణలు స్వయంగా పూర్తి

చేయవలసిందే – ఒక్క రమీ తప్ప. వికలాంగులు, బలహీనులు రమీ కొరకు స్వయంగా వెళ్ళక, ఇతరులను నియమించే ఆచారం చాలా పాతది మరియు అనుమతించబడినది. ఇతర హజ్ లేదా ఉమ్రహ్ ఆచరణల విషయంలో స్వయంగా తమకు బదులుగా ఇతరులను నియమించే అలాంటి ఆచారం ఎక్కడా పేర్కొనబడలేదు. అల్లాహ్ ప్రసాదించిన జ్ఞానం ఆధారంగా మాత్రమే అన్ని ఆరాధనలకు సంబంధించిన ఆచరణలు తటస్థంగా చేయాలి. కాబట్టి, సరైన సాక్ష్యాధారాలు లేని ఆచరణలను ఏదో విధంగా ధర్మబద్ధమైనవిగా చేసుకోవడం తగదు. ఇతరుల తరుఫున రమీ చేసేవారు, ముందుగా తమ రమీ పూర్తి చేయాలి. ఆ తర్వాత అక్కడే నిలబడి ఇతరుల తరుఫున రమీ చేయాలి. అంటే జమరాతుల పై రాళ్ళు విసిరే టపుడు, ముందుగా తన రాళ్ళు విసిరి, అదే జమరాతు వద్ద నిలబడి ఇతరుల తరుఫున రాళ్ళు కూడా విసరాలి. అంతేగాని, మొత్తం మూడు జమరాతులపై తన రాళ్ళు విసరటం పూర్తి చేసి, ఆ తర్వాత మూడు జమరాతులపై ఇతరుల తరుఫున రాళ్ళు విసరటమని కాదు. దీనికి పూర్వ దృష్టాంతం ఏదీ లేకపోయినా, పండితుల అభిప్రాయం ఇదే. దీనికి భిన్నంగా చేయటమనేది చాలా కష్టమైన పని.

దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది –

وَمَا جَعَلَ عَلَيْكُمْ فِي ٱلدِّينِ مِنْ حَرَجٍ

వమా జఅల అలైకుమ్ ఫిద్దీని మిన్ హరజిన్

కష్టమైన పని ఏదీ ధర్మంలో మీపై ఆదేశించబడలేదు 22:78

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీథు:

يَسِّرُوْا وَلاَ تُعَسِّرُوْا

యస్సిరూ వలా తుఅస్సిరూ

పనిని సులభతరం చేయండి, అంతేగాని కష్టతరం చేయవద్దు.

తన రమీ పూర్తి చేసిన తర్వాత, చిన్నపిల్లల లేదా బలహీనుల కొరకు తిరిగి వెళ్ళి, మరలా రమీ చేసినట్లుగా ఏ సహాబా నుండి కూడా నమోదు చేయబడలేదు. ఒకవేళ వారు అలా చేసి ఉండినట్లయితే, అది నమోదు చేయబడి ఉండేది మరియు అన్ని విధాలా అవి అందుబాటులో ఉండేవి. ఉత్తమమైన విషయం అల్లాహ్ కే తెలుసు.

## హజ్జె తమత్తు & హజ్జె ఖిరన్ పద్ధతిలో హజ్ చేసే వారి కొరకు నిర్దేశించబడిన హదీ (ఖుర్బానీ పశువు):

ఒకవేళ హజ్జె తమత్తు (ముతమత్తి) లేక హజ్జె ఖిరన్ (ఖారిన్) పద్ధతిలో హజ్ చేస్తున్న హాజీ, పవిత్ర మక్కహ్ సరిహద్దులలో నివసించని వాడైతే, అతను అల్లాహ్ కొరకు ఒక హదీ (ఖుర్బానీ పశువు) సమర్పించుకోవలసి ఉంది – అది ఒక మేక లేక గొర్రె లేక ఒక ఒంటె లేదా ఒక ఆవులో 7వ వంతు వాటా.

## ధర్మబద్ధమైన సంపాదనతోనే హదీ (ఖుర్బానీ పశువు) కొనాలి:

తప్పకుండా హజ్ యాత్రికుడు పూర్తిగా తన ఆదాయంతోనే మరియు ధర్మబద్ధమైన పవిత్ర సంపాదనతోనే ఖుర్బానీ పశువు కొనాలి. ఎందుకంటే అల్లాహ్ పవిత్రుడు మరియు పవిత్రమైన వాటినే స్వీకరిస్తాడు. ఖుర్బానీ పశువు కొనటం కొరకు ఎవరైనా ధనవంతులను లేదా ఇతరులను యాచించటమనేది ఒక ముస్లిం చేయవలసిన పని కాదు. ఎందుకంటే అల్లాహ్ అతనికి తగినంత ఆదాయం సమకూర్చినపుడు మరియు ఖుర్బానీ పశువు కొనగలిగే శక్తి ఇచ్చినపుడు మాత్రమే అతనిపై హజ్ విధి అవుతుంది. దీని వలన అతడు ఇతరుల సంపద మీద మరియు ఆదాయం మీద ఆధార

పడవలసిన అవసరం లేదు. ఇతరులను యాచించటాన్ని అనేక హదీథులు ఖండిస్తున్నాయి మరియు అలా చేయటం చెడు పనిగా ప్రకటిస్తున్నాయి. అంతేగాక, ఇతరులను యాచించని వారిని అవి ప్రశంసిస్తున్నాయి కూడా.

**తమ వద్ద హదీ లేనివారు హజ్ దినాలలో మూడు రోజులు మరియు హజ్ నుండి మరలి వచ్చిన తర్వాత ఏడు రోజులు ఉపవాసం ఉండాలి:**

ఒకవేళ హజ్జె తమత్తు లేదా హజ్జె ఖిరన్ పద్ధతిలో హజ్ చేస్తున్న హజ్ యాత్రికులు హదీ పశువు ఖుర్బానీ చేయలేకపోతే, అతను మొత్తం ఏడు రోజులు ఉపవాసం ఉండాలి – వాటిలో మూడు రోజులు హజ్ దినాలలో మరియు ఏడు రోజులు హజ్ నుండి మరలి వచ్చిన తర్వాత. అయితే యౌమున్నహర్ అంటే దిల్ హజ్ 10వ తేదీ కంటే ముందు దినాలలో లేదా దిల్ హజ్ 10వ తేదీ తర్వాత దినాలలో అంటే తష్రీఖ్ దినాలలో అతను హజ్ దినాలలో పాటించవలసిన మూడు ఉపవాసాలను పూర్తి చేయవచ్చు.

దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉంది:

وَأَتِمُّواْ ٱلۡحَجَّ وَٱلۡعُمۡرَةَ لِلَّهِۚ فَإِنۡ أُحۡصِرۡتُمۡ فَمَا ٱسۡتَيۡسَرَ مِنَ ٱلۡهَدۡيِۖ وَلَا تَحۡلِقُواْ رُءُوسَكُمۡ
حَتَّىٰ يَبۡلُغَ ٱلۡهَدۡيُ مَحِلَّهُۥۚ فَمَن كَانَ مِنكُم مَّرِيضًا أَوۡ بِهِۦٓ أَذٗى مِّن رَّأۡسِهِۦ فَفِدۡيَةٞ مِّن
صِيَامٍ أَوۡ صَدَقَةٍ أَوۡ نُسُكٖۚ فَإِذَآ أَمِنتُمۡ فَمَن تَمَتَّعَ بِٱلۡعُمۡرَةِ إِلَى ٱلۡحَجِّ فَمَا ٱسۡتَيۡسَرَ مِنَ
ٱلۡهَدۡيِۚ فَمَن لَّمۡ يَجِدۡ فَصِيَامُ ثَلَٰثَةِ أَيَّامٖ فِي ٱلۡحَجِّ وَسَبۡعَةٍ إِذَا رَجَعۡتُمۡۗ تِلۡكَ عَشَرَةٞ كَامِلَةٞۗ
ذَٰلِكَ لِمَن لَّمۡ يَكُنۡ أَهۡلُهُۥ حَاضِرِي ٱلۡمَسۡجِدِ ٱلۡحَرَامِۚ وَٱتَّقُواْ ٱللَّهَ وَٱعۡلَمُوٓاْ أَنَّ ٱللَّهَ
شَدِيدُ ٱلۡعِقَابِ ١٩٦

వ అతిమ్ముల్ హజ్జ వల్ ఉమ్రత లిల్లాహి ఫ ఇన్ ఉహ్సిర్ తుమ్ ఫమాస్ తైసర మినల్ హదీ వలా తహ్లిఖూ రుఊసకుమ్ హత్తా యబ్లుగల్ హద్యు మహిల్లహు ఫమన్ కాన మింకుమ్ మరీదన్ అవ్ బిహీ అదన్ మినర్రాఅసిహీ ఫఫిద్యతున్ మినస్సియామిన్ అవ్ సదఖతిన్ అవ్ నుసుకిన్ ఫఇదా అమిన్తుమ్ ఫమన్ తమత్తాఅ బిల్ ఉమ్రతి ఇలల్ హజ్జి ఫమాస్ తైసర మినల్ హదీ ఫమన్ లమ్ యజిద్ ఫ సియాము థలాథతి అయ్యామిన్ ఫిల్ హజ్జి వ సబ్ అతిన్ ఇదా రజఅతుమ్ తిల్కఅషరతున్ కామిలతున్ దాలిక లిమన్ లమ్ యకున్ అహ్ లుహు హాదిరిల్ మస్జిదిల్ హరామి వత్తఖుల్లాహ్ వఅలమూ అన్నల్లాహ షదీదుల్ ఇఖాబి.

మీరు శాంతి-సురక్షల పరిస్థితులలో ఉన్నప్పుడు, ఎవరైనా ఉమ్రా నుండి హజ్జ్ వరకు ఉన్న సౌలభ్యాన్ని వినియోగించుకున్నట్లయితే, వారు ఖుర్బానీ జంతువులలో నుండి సులభంగా సమకూర్చుకోగలిగే దానిని అర్పించాలి. కానీ, అలా చేయలేక పోయినవారు, మూడు రోజులు హజ్జ్ దినములలో మరియు ఏడు రోజులు వాపసు వెళ్ళిన తరువాత ఉపవాసం పాటించాలి. ఈ ఉపవాసం మొత్తం పది దినములు - ఇది ఎవరి గృహస్థులు (నివాసం) మస్జిదె హరామ్ దగ్గర లేరో వారికి మాత్రమే వర్తిస్తుంది. 2:196

సహీహ్ బుఖారీలో నమోదు చేయబడిన ఆయెషా రదియల్లాహు అన్హా మరియు అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమాల ఉల్లేఖనలలో 'తష్రీఖ్ దినాలలో ఉపవాసం పాటించే అనుమతి కేవలం హదీ సమర్పించే స్థోమత లేని హజ్ యాత్రికులకు మాత్రమే వర్తిస్తుందని' తెలుపబడింది. ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించారనటానికి తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయి. అయితే ఈ మూడు దినాల ఉపవాసాలు అరఫహ్ దినానికి ముందే పాటించడం మంచిది. అలా చేయడం ద్వారా అతను అరఫహ్ దినాన ఉపవాసం ఉండవలసిన అవసరం కలుగదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అరఫాత్ లో ఉండినారు మరియు ఆ దినమున ఆయన ఉపవాసం

పాటించలేదు. అంతేగాక ఆ దినాన ఉపవాసం పాటించవద్దని ఆయన తన సహచరులను కూడా ఆదేశించారు. అన్నపానీయాలు సేవించడం ద్వారా లభించే అధిక శక్తితో మనం ఆ రోజున వీలయినంత ఎక్కువగా అల్లాహ్ ను స్మరించవచ్చు మరియు అల్లాహ్ ను వేడుకోవచ్చు. ఈ మూడు రోజుల ఉపవాసాలు నిరంతరంగా అంటే ఒకదాని తర్వాత ఒకటి వరుసగా మూడు రోజులు పాటించవచ్చు లేదా ఒక్కొక్కటి విడివిడిగా ఉండవచ్చు. అలాగే హజ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత పూర్తి చేయవలసి ఉన్న ఏడు రోజుల ఉపవాసాలు కూడా నిరంతరంగా ఒక దాని తర్వాత ఒకటి ఉండ వచ్చు లేదా అపుడపుడు విడివిడిగా ఉండవచ్చు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రెండింటిలో ఏదో ఒకదానికి ప్రత్యేకత ఇవ్వలేదు. ఇంటికి మరలి వచ్చిన తర్వాత, అల్లాహ్ ఆదేశించిన విధంగా మిగిలిన ఏడు దినాల ఉపవాసాలు పూర్తి చేయాలి

وَ سَبْعَةٍ إِذَا رَجَعْتُمْ

వ సబ్అతిన్ ఇదా రజఅతుమ్

ఏడు రోజులు వాపసు వెళ్ళిన తరువాత ఉపవాసం పాటించాలి.

ఎవరి వద్దనైతే ఖుర్బానీ పశువు కొనే స్థోమత లేదో, అలాంటి వారు రాజులను మరియు ధనవంతులను ఖుర్బానీ పశువు కొరకు యాచించే బదులు, ఉపవాసం ఉండటం మంచిది. అయితే, ఎవరైనా నిస్వార్థంగా ఇతరులకు ఖుర్బానీ పశువును బహూకరించినా లేదా ఏదైనా ఇతర వస్తువును బహూకరించినా, అతను ఇతరుల తరుఫున హజ్ చేస్తున్నా సరే, అందులో ఎలాంటి దోషమూ లేదు – అలాంటివి స్వీకరించబడవు అనే షరతు ఉంటే తప్ప. ఖుర్బానీ పశువుల కొరకు ప్రభుత్వాన్ని లేదా ఇతరులను యాచించటమనేది నిస్సందేహంగా ధర్మబద్ధమైన పని కాదు మరియు అది మోసగించటం క్రిందికి రావచ్చు.

**అల్లాహ్ మమ్మల్ని మరియు ఇతర ముస్లింలను ఇలాంటి తప్పుల నుండి కాపాడు గాక!**